క్లుప్తంగా

మోడల్ స్కూల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కారెంపూడి : స్థానిక మోడల్ స్కూల్‌లో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్ నయోమి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరంలో 7, 8, 9వ తరగతుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ నెల 18వ తేదీలోపు పాఠశాలకు రావాలని కోరారు. 20వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించి మెరిట్ ఆధారంగా ప్రవేశం కల్పిస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు.

నేడు పోలేరమ్మ తల్లి సప్తమి వార్షికోత్సవం



వెల్దుర్తి : మండలంలోని గుండ్లపాడు గ్రామంలో వేంచేసియున్న శ్రీ పోలేరమ్మ తల్లి సప్తమి వార్షిక వేడుకలను ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించనున్నట్లు అర్చకులు వెల్లంకి కృష్ణశర్మ, సుబ్రహ్మణ్య శర్మలు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివారం ఉదయం 7 గంటల నుంచి పలు పూజలు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం 12గంటల నుంచి మహా అన్నదాన కార్యక్రమం జరుగుతుందన్నారు.

ఇంటిలో దొంగతనానికి పాల్పడిన వ్యక్తి అరెస్ట్



క్రోసూరు: ఈనెల 13 వ తేదీ న మండలంలోని దొడ్లేరు గ్రామంలో ఇంటిలో దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని శనివారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ మహమ్మద్ షఫీ తెలిపారు. మండలంలోని అనంతవరం గ్రామానికి చెందిన జవ్వాదిసురేష్ చెడువ్యసనాలకు అలవాటుపడి గ్రామంలో, చుట్టుప్రక్కల గ్రామాల్లో అప్పులు చేసాడు. తన ఖర్చులకు ,అప్పులు తీర్చేందుకు డబ్బుల కోసం తిరుగుతూ దొడ్లేరులోని పోసిపోగు ఆంధ్రబాబు ఇంట్లో బంగారు వస్తువులున్న ట్రంకు పెట్టె చోరీ చేసాడు. ముద్దాయి గతంలో కూడా పత్తి దొంగతనం కేసులో జైలుకెళ్లాడని తెలిపారు. డీఎస్పీ జి. గురునాథ బాబు పర్యవేక్షణలో సీఐ ఎం.మంగారావు, ఎస్ఐ ,సిబ్బంది కలిసి అనంతవరం గ్రామంలో అరెస్ట్ చేసినట్లు చెప్పారు. అతడి నుంచి 155.950 గ్రాముల బంగారపు ఆభరణాలు, 132 గ్రాముల వెండి వస్తువులు, రూ 3,500 నగదు, ఒక వివో సెల్‌ఫోను స్వాధీనపరుచుకున్నట్లు తెలిపారు.

ఐదు ఒంటెలు స్వాధీనం

పట్నంబజారు: నిబంధనలకు విరుద్ధంగా తీసుకొచ్చిన ఐదు ఒంటెలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పొన్నూరు రోడ్డులోని ఆంధ్రా ముస్లిం కళాశాల సమీపంలో ఐదు ఒంటెలు ఉండటం గుర్తించారు. గో సంరక్షణ సమితి సభ్యుల ఇచ్చిన సమాచారం మేరకు ఆ ఒంటెలను స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

వ్యభిచారం నిర్వహిస్తున్న పలువురు అరెస్టు

గుంటూరు ఈస్ట్: వ్యభిచార ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మల్లారెడ్డినగర్‌లోని ఓ నివాసంలో వ్యభిచారం నిర్వహిస్తున్నారన్న సమాచారంతో శనివారం దాడి చేశారు. ఇంట్లోని ఐదుగురు మహిళలు, ముగ్గురు విటులు, ఇరువురు నిర్వాహకులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. మహిళలను రెస్క్యూ హోంకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యాకానుకల నిల్వకేంద్రం పరిశీలన



గుంటూరు ఎడ్యుకేషన్: నగరంపాలెంలోని స్టాల్ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్టూడెంట్ కిట్స్ స్టాక్ పాయింట్‌ను రాష్ట్ర పరిశీలకురాలు సుహాసిని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా గుంటూరు నగర పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలకు పంపిన స్టూడెంట్ కిట్ల వివరాలపై ఎంఈవోలు నాగేంద్రమ్మ, జ్యోతికిరణ్‌లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గుంటూరు నగర పరిధిలోని 203 ప్రభుత్వ, ఎయిడెడ్, నగరపాలక సంస్థ పాఠశాలల్లో చదువుతున్న 28 వేల మందికి పైగా విద్యార్థులకు అవసరమైన స్టూడెంట్ కిట్లను సంబంధిత పాఠశాలలకు పంపినట్లు ఎంఈవోలు సుహాసిని దృష్టికి తెచ్చారు. స్టాక్ పాయింట్‌లో ఉన్న సామగ్రి మొత్తాన్ని పాఠశాలలకు పంపడంతో అన్ని రూములు ఖాళీగా ఉండటాన్ని గమనించిన సుహాసిని సంతృప్తి వ్యక్తం చేశారు. అదే విధంగా పాఠ్య పుస్తకాల కోసం వచ్చిన వివిధ పాఠశాలల ఉపాధ్యాయులకు ఆమె స్వయంగా పుస్తకాలను అందజేశారు.

మినరల్ కాదు.. జనరల్

- శుద్ధీకరణ పేరిట ప్రజలను మోసగిస్తున్న సంస్థలు
- ఐఎస్ఐ ధ్రువీకరణ లేకుండానే నీటి విక్రయాలు
- నిబంధనలు పాటించని ప్లాంట్ నిర్వాహకులు
- ఇంత జరుగుతున్నా చోద్యం చూస్తున్న అధికారులు



ఆటోల్లో తరలిస్తున్న వాటర్ క్యాన్లు

సత్తెనపల్లి: పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా ప్రజలు మినరల్ వాటర్‌నే అధికంగా వినియోగిస్తున్నారు. ఫలితంగా శుద్ధి చేసిన నీటికి అలవాటు పడ్డారు. సత్తెనపల్లి నియోజకవర్గ పరిధిలో సత్తెనపల్లి పట్టణం, సత్తెనపల్లి రూరల్, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు మండలాలు ఉన్నాయి. ఒక పట్టణం , నాలుగు మండలాల్లో సుమారు 100 కిపైగా వాటర్ ప్లాంట్లు ఉన్నాయి. వీటిలో 60 శాతం వాటికి అనుమతులు లేవు. సాధారణంగా మున్సిపల్ ద్వారా పట్టణంలోని వార్డులకు, పంచాయతీల ద్వారా గ్రామాలకు తాగునీరు అందించాల్సి ఉంటుంది. గ్రామీణ తాగునీటి సరఫరా సరిగ్గా లేని కారణంగా ప్రజలు మినరల్ వాటర్ ప్లాంట్లలో లభ్యమయ్యే తాగునీటికి అలవాటు పడ్డారు. ఈ నేపథ్యంలో క్యాన్ నీళ్లకు డిమాండ్ పెరిగింది. పుట్టగొడుగుల్లా వాటర్ ప్లాంట్లు వెలిశాయి. చాలామంది ఆటోల్లో క్యాన్లను ప్లాంట్ వద్దకు తీసుకెళ్లి నీళ్లు నింపి ఇళ్ల వద్దకు వచ్చి అమ్ముతున్నారు. చిన్న టీకొట్టు దగ్గర నుంచి పెద్ద హోటళ్ల వరకు ఈ నీటినే వాడుతున్నారు. దీంతో మినరల్ వాటర్‌కు డిమాండ్ ఉండడంతో ప్లాంట్ నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా జనరల్ నీటినే సరఫరా చేస్తున్నారు. ప్లాంట్లుపై చర్యలు తీసుకోవాల్సిన మున్సిపల్, పంచాయతీ అధికారులు చోద్యం చూస్తున్నారు.

శుద్ధి చేసిన తీరు ఇది..

మినరల్ వాటర్ ప్లాంట్ యజమానులు ముందుగా బోరు వేసి అక్కడ ఒక గదిని ఏర్పాటు చేసుకొని నీటిని శుద్ధి చేస్తామని చెబుతారు. మీరు రుచిగా ఉండటానికి సోడియం ఫ్లోరైడ్, సోడియం కార్బోనేట్ వంటి పొడర్లు కలుపుతారు. ప్లాంట్లులో పనిచేసే వారు చేతులకు గ్లౌజ్‌లు వంటివి వేసుకోకుండా నీటిని నింపుతారు. క్యాన్‌లను ఆటోల ద్వారా ట్యాంకుల్లో నింపి విక్రయిస్తున్నారు. మరికొంతమంది ఇళ్ల ముందే ప్లాంట్లు ఏర్పాటు చేసుకొని వినియోగదారుడు రాగానే క్యాన్‌కు పట్టి పంపిస్తున్నారు.

ఇష్టమొచ్చిన ధరకు అమ్మకాలు..

వాటర్ ప్లాంట్ నిర్వాహకులు నిబంధనలు పట్టించుకోకుండా నీటిని క్యాన్‌లలో నింపి ధరలను కూడా ఇష్టానుసారంగా విధిస్తున్నారు. 20 లీటర్ల నీటిని రూ. 15 నుంచి రూ. 20 వరకు అమ్ముతున్నారు. ఇళ్ళ ముందు ఏర్పాటు చేసుకున్న చిన్న ప్లాంట్లు వద్దకు వచ్చేవారికి 20 లీటర్ల నీటిని రూ. 5కు విక్రయిస్తున్నారు. ఇవికాక వాటర్‌ని కూలింగ్ చేసి 20 లీటర్ల క్యాన్‌ను రూ. 30 చొప్పున విక్రయిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కనీస ప్రమాణాలు పాటించని వాటర్ ప్లాంట్లపై చర్యలు తీసుకొని నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇవీ నిబంధనలు...

- ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు చేయాలంటే తప్పనిసరిగా ఐఎస్ఐ సర్టిఫికెట్ ఉండాలి.
- 12 రకాల ధ్రువీకరణ పత్రాలు ప్లాంట్ యజమానులు పొందాలి.
- అత్యున్నత సాంకేతికత కలిగిన మిషన్‌లతో నీటిని శుద్ధి చేయాలి.
- నీటిని పరీక్షించడానికి ఒక ల్యాబ్ ఏర్పాటు చేసుకొని, రోజూ శుద్ధి చేసిన నీటిని పరీక్షించాలి.
- వాటర్ ప్యాకెట్ల తయారీలో 60 మైక్రాన్ల కంటే ఎక్కువ పాలిథిన్‌ను వినియోగించాలి. -ఐఎస్ఐ ముద్రను తప్పనిసరిగా ముద్రించాలి.
- ప్యాకెట్ల కాలపరిమితి గడువును తప్పక ముద్రించాలి. తయారైనప్పటినుంచి 21 రోజుల్లో వాటిని విక్రయించాలి.
- ఇళ్ల మధ్య భూమిలో నీటిని వినియోగించకూడదు. మునిసిపల్, పంచాయతీ అనుమతి తీసుకొని పైప్ లైన్ ద్వారా నీటిని వినియోగించుకోవాలి.

రాత్రి వేళల్లో కరెంట్ పోతే సంప్రదించండి

పిడుగురాళ్ల: రాత్రి వేళల్లో కరెంట్ పోతే సంప్రదించండి లైన్ మెన్‌లను సంప్రదించాలని విద్యుత్ శాఖ ఏఈ ఆరికట్ల శివనాగిరెడ్డి తెలియజేశారు. ఆదివారం కరెంట్ పోతే కె. మహేష్ 6281702426, జి. ప్రవీణ్‌కుమార్ 958122427, సోమవారం ఎన్. కోటేశ్వరరావు 6281702404, ఎం. సాంబశివరావు 9581224629, మంగళవారం - వై. చంద్రోశఖర్ 6281702423, ఎం హెచ్ సైదారావు 9581224628, బుధవారం - బి. ఆంజనేయులునాయక్ 6281702602, కె. గంగరాజు 9581225079, శుక్రవారం - టీఎస్ రామకృష్ణ - 6281702424, బి. రామునాయక్ 9581224631, శనివారం ఎస్. రాజేష్‌కుమార్ - 6281702421, ఎం. మస్తాన్‌వలి 9581224626 లకు ఫోన్ చేసి తెలియజేయాలని ఏఈ శివనాగిరెడ్డి తెలిపారు.

వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

సత్తెనపల్లి: పట్టణంలోని వడవల్లిలో గల శ్రీ రామాలయం శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని తులసి మాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి దర్శనం చేసుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం



దాచేపల్లి: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, గురజాల శాసనసభ్యుడు యరపతినేని శ్రీనివాస రావు చిత్రపటాలకు టీడీపీ, జనసేన నాయకులు శనివారం క్షీరాభిషేకం చేశారు. మేనిఫెస్టోలో ప్రకటించిన ప్రధానమైన అంశాలను అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవటంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు నారాయణపురం పార్టీ కార్యాలయంతోపాటు దాచేపల్లిలో సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం జరిగింది. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ బెల్లంకొండ బద్రి, మాజీ చైర్మన్ నర్రా పుల్లయ్య, జెడ్పీటీసీ కొగంటి శివన్నారాయణ, సొసైటీ మాజీ అధ్యక్షుడు గొళ్ల నారాయణ, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వేముల వినోద్‌రెడ్డి, నాయకులు వేముల తిరుమల కుమార్, తంగెళ్ల శ్రీనివాసరావు, కొప్పుల గిరి, మునగా నిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐరన్ రైలింగ్‌కు మరమ్మతులు చేపట్టరూ...



పడిపోయేందుకు సిద్ధంగా ఉన్న ఐరన్ రైలింగ్

దాచేపల్లి: నడికుడి రైల్వేస్టేషన్ సమీపంలోని గోగులపాడు రోడ్డులోని ఆర్‌వోబీ వద్ద ఏర్పాటు చేసిన ఐరన్ రైలింగ్ ప్రమాదకరంగా ఉంది. ఈ రోడ్డులో రాకపోకలు సాగించేందుకు ఆర్‌వోబీని రైల్వే అధికారులు నిర్మించారు. భారీ వాహనాలు రాకపోకలు సాగించకుండా రైల్వే అధికారులు ఐరన్ రైలింగ్ ఏర్పాటు చేశారు. ఇటీవల ఓ భారీ వాహనం ఈ రోడ్డులో వెళ్లేందుకు ప్రయత్నించటంతో రైలింగ్ దెబ్బతింది. రైలింగ్‌కి ఉంచిన సపోర్ట్ ఐరన్ గడ్డర్స్ వంగిపోయాయి. రైలింగ్ మధ్యభాగం కూడా పడిపోయేలా ఉంది. ఈ రోడ్డులో వాహనాల రాకపోకలు అధికంగానే ఉంటాయి. ప్రమాదాలు జరగకముందే రైల్వే అధికారులు స్పందించి ఐరన్ రైలింగ్‌కి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

మహాకవి శ్రీశ్రీ యువతకు ఆదర్శం

క్రోసూరు: మహాకవి శ్రీరంగం శ్రీనివాసరావును యువత ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఉందని ది క్రోసూరు యూత్ సర్వీస్ క్లబ్ గౌరవాధ్యక్షులు కొంకాయల వీరాంజనేయరెడ్డి అన్నారు. శనివారం మహాకవి శ్రీశ్రీ వర్ధంతి పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆంజనేయరెడ్డి మాట్లాడుతూ తన రచనల ద్వారా సమాజంలోని అసమానతలు, మూఢ విశ్వాసాలు, దేశంలో నెలకొన్న దోపిడీ వ్యవస్థపై నిప్పులు చెరుగుతూ రాసిన కవితలను పేదలకు అంకితం చేసిన మహాకవి శ్రీశ్రీ అన్నారు. ఆయన కవితలు నేటికీ ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయాయని అన్నారు. క్లబ్ అధ్యక్షులు రొంపిచర్ల రామచంద్ర ప్రసాద్ మాట్లాడుతూ నవయుగ వైతాళికుడు శ్రీశ్రీ అని అన్నారు. మహిళా సాధికారతను, వారి సమస్యలను ఎలుగెత్తి చాటడంలో శ్రీశ్రీని ఆదర్శంగా తీసుకోవాలని షిరిడి సాయిబాబా సంఘ కమిటీ చైర్మన్ మస్నెం వెంకట్రావు అన్నారు. ముందుగా శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దళిత నాయకులు దాసు, బీసీ సెల్ నాయకులు బొప్పూడి రమేష్, మామిడి పెద్ద సింగయ్య పాల్గొన్నారు.

మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి విజయోత్సవ ర్యాలీ



అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే జూలకంటి

కారెంపూడి :మాచర్ల శాసన సభ్యులుగా ఘన విజయం సాధించి శనివారం నియోజకవర్గానికి విచ్చేసిన ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డికి టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు, నాయకులు వేలాదిగా తరలివచ్చి ఘన స్వాగతం పలికారు. మండలంలోని పేటసన్నెగండ్ల ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం విజయోత్సవ ర్యాలీ ప్రారంభమైంది. మండల పార్టీ నాయకులు క్రేన్‌తో భారీ గజమాలలను ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డికి వేశారు. అక్కడి నుంచి ఎమ్మెల్యే వాహనంపై నుంచి ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. ఇంతటి ఘన విజయాన్ని అందించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ర్యాలీ కారెంపూడి సెంటర్, ఒప్పిచర్ల, నరమాలపాడు గ్రామాల మీదుగా కొనసాగింది. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కార్యకర్తలు వేలాదిగా పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ అధికారులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

లోక్ అదాలత్‌తో కేసుల సత్వర పరిష్కారం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు

గురజాల: లోక్ అదాలత్‌లతో కేసుల సత్వర పరిష్కారానికి అవకాశం ఉంటుందని సీనియర్ సివిల్ జడ్జి వై. శ్రీనివాసరావు అన్నారు. ఈ నెల 29వ తేదీన కోర్టులో నిర్వహించబోయే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్థానిక కోర్టులోని పోలీస్, బీఎస్ఎన్ఎల్ అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీన జరిగే లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కక్షిదారులను కోరారు. రాజీ మార్గం రాజమార్గం అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సత్యనారాయణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ జానీబాషా, ఏవీ నాగార్జున, బండి వీరభద్రుడు, ఆచంట శ్రీనివాసరావు, హుస్సేన్ ఖాన్ పఠాన్, గురజాల, దాచేపల్లి, కారంపూడి పోలీస్ స్టేషన్ ఎస్ఐలు, సీఐలు పాల్గొన్నారు.

అంకెలు కాదు ఆపద్బాంధవులు

- ఆపత్కాలంలో ఆదుకునే 100, 112, 182, 1098
- యువతులు, చిన్నారులు, మహిళలకు వరం
- వీటికి తోడు మహిళల సంరక్షణకు దిశ కాల్స్



దిశ యాప్

తాడేపల్లిరూరల్: ఆపద వేళ ఆపద్బాంధువులను పిలిచేందుకు ఈ నంబర్లను గుర్తుంచుకోవడం అవసరం. తల్లిదండ్రులు, జీవిత సహచరుల నంబర్లతో పాటు ఈ నంబర్లను కూడా విధిగా గుర్తుపెట్టుకుని అవసరం అనుకున్న వేళ వాడుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. పోలీసులు ఎల్లవేళలా అప్రమత్తంగా ఉంటున్నారు. కాల్ రావడమే ఆలస్యం ఘటన స్థలానికి చేరుకుంటున్నారు. అవసరం అనుకుంటే అరెస్టులు కూడా చేస్తున్నారు. మనం చేయాల్సిందల్లా ఒకే ఒక్క పని... అత్యవసర వేళ సంకోచించకుండా ఎమర్జెన్సీ నంబర్లకు ఫోన్ చేయడం. ప్రస్తుత సమాజంలో మహిళలపై జరిగే ఆకృత్యాలను అడ్డుకోవడానికి చిన్నారులపై, యువతులపై లైంగిక దాడులు జరిపే నేరగాళ్ల పని పట్టడానికి ఈ ఎమర్జెన్సీ కాల్స్ ఎంతో ఉపయోగం. 24 గంటలూ అందుబాటులో ఉండేలా ప్రభుత్వాలు కొన్ని ఎమర్జెన్సీ టోల్ ఫ్రీ నంబర్లు ప్రవేశ పెట్టాయి.

డయల్ 100

ఎప్పటి నుంచో అందుబాటులో ఉన్న నంబరు 100. ఈ నెంబరుకు డయల్ చేస్తే నేరుగా పోలీస్ కంట్రోల్ రూమ్‌కు చేరుతుంది. బాధితులు తమ పరిస్థితి వివరించాక అక్కడి నుంచి సంబంధిత పీఎస్‌కు లైన్ కలిపి అలెర్ట్ చేస్తారు. జీపీఎస్ లొకేషన్ ఆధారంగా సమీపంలో ఉన్న పోలీసులు, గస్తీ వాహనాలను అప్రమత్తం చేయడమే కాక బాధితురాలు ధైర్యంగా ఉండేలా పలు సూచనలు చేస్తారు. పది నిమిషాల్లో అక్కడకు చేరుకుంటారు.

1091

మహిళలను అత్తింటివారు, భర్త హింసించడం, కొట్టడం వంటివి చేస్తే 1091కు కాల్ చేస్తే నేరుగా మహిళా సెల్‌కు కనెక్ట్ అవుతుంది. అంతేకాక మహిళలపై దాడికి పాల్పడినప్పుడు ఎవరైనా బయట వ్యక్తి చూసినా ఈ నంబరుకు కాల్ చేయవచ్చు. పిల్లలను హింసించినా సాయం కోరవచ్చు.

112

గతంలో మహిళల సమస్యలపై నేరుగా 100కు డయల్ చేస్తే పోలీసు యంత్రాంగం వెంటనే అప్రమత్తమయ్యేది. ఇప్పుడా నంబరుకు అన్ని రకాల ఫిర్యాదులు ఎక్కువ కావడంతో మహిళల సౌలభ్యం కోసం ప్రత్యేకించి 112 నెంబరును కేంద్ర హోం శాఖ ప్రవేశపెట్టింది. బాధితులు దేశంలో ఎక్కడి నుంచైనా ఈ నెంబరుకు కాల్ చేస్తే చాలు. వారికి సంబంధించిన రాష్ట్రంలోని పోలీసు కంట్రోల్ రూమ్‌కు చేరుతుంది. దీనికంటూ 112 మొబైల్ యాప్ కూడా ఉంది.

182

ఈ నంబరు రైల్వే డివిజన్ పరిధిలో ఉన్న ఆర్‌పీఎఫ్ పోలీస్ కంట్రోల్ రూమ్‌నకు చేరుతుంది. ఎవరైనా రైళ్లలో ప్రయాణించేటప్పుడు లైంగిక వేధింపులకు గురైనా, దొంగతనాలు, ఆపదలో ఉండే సందర్భాల్లో ఈ నెంబరుకు కాల్ చేయవచ్చు. బాధితులు ప్రయాణిస్తున్న సంబంధిత రైలులో ఉండే ఆర్పీఎఫ్ పోలీసులకు కంట్రోల్ రూమ్ నుంచి మెసేజ్ వెళ్తుంది. వెంటనే బాధితులున్న భోగీల్లో పోలీసులు అప్రమత్తమై సమస్యను పరిష్కరిస్తారు.

91212 11100

మహిళలు ముఖ్యంగా యువతులపై జరిగే సైబర్ నేరాలపై ఫిర్యాదులు స్వీకరించేందుకు సైబర్ మిత్ర పేరిట వాట్సప్ నంబరు 91212 11100ను ఆంధ్రప్రదేశ్ పోలీసులు అందుబాటులోకి తెచ్చారు. ఆపదలో ఉండి అత్యవసర పరిస్థితుల్లో ఈ నెంబరుకు మెస్సేజ్ పంపిస్తే పోలీసులు వాలిపోతారు. ఈ నంబరు 24 గంటలూ అందుబాటులో ఉంటుంది.

దిశ యాప్ ఉండనే ఉంది...

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన దిశ యాప్‌పై ప్రజల్లో నమ్మకం పెరిగింది. యాప్‌లోని ఎస్ఓఎస్ బటన్ క్లిక్ చేస్తే చాలు ఆపదలో ఉన్న సంకేతాలు నేరుగా పోలీస్ కంట్రోల్ రూంకు చేరి వెంటనే పోలీసులు అలెర్ట్ అయ్యి సమస్యను పరిష్కరిస్తారు.

మహిళల భద్రతకు....

మహిళల భద్రతకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. మహిళలను వేధించే వారిపై ప్రస్తుత చట్టాలు కఠినంగా ఉన్నాయి. ప్రజలు ఎమర్జెన్సీ నంబర్లను వినియోగించుకోవాలి.

నిరుద్యోగ భృతికి విధివిధానాలు ప్రకటించాలి

డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయ రాజు



మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

సత్తెనపల్లి: నిరుద్యోగ భృతిపై రాష్ట్ర ప్రభుత్వం విధివిధానాలు వెంటనే రూపొందించి అమలు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయ రాజు డిమాండ్ చేశారు. డీవైఎఫ్ఐ పల్నాడు జిల్లా కమిటీ సమావేశం పట్టణంలోని పుతుంబాక వేంకటపతి భవన్ నందు శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో గ సమీక్షతో పాటు భవిష్యత్తు కార్యక్రమాల మీద చర్చించారు. సమావేశం అనంతరం ఆంజనేయ రాజు మాట్లాడుతూ నిరుద్యోగ భృతి హామీని వెంటనే అమలు చేయాలని, స్కిల్ అసెస్మెంట్ పేరిట కాలయాపన చేయకూడదన్నారు. ఉపాధి పొందటం ప్రజల ప్రాథమిక హక్కుగా ప్రభుత్వాలు చేర్చాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం చేసిన 75 శాతం స్థానిక పరిశ్రమలో రిజర్వేషన్ చట్టాన్ని కొనసాగించి కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సందర్భంగా జరిగిన హింసలో బలి అయ్యింది యువతేనన్నారు. రాజకీయ పార్టీలు తమ స్వార్థం కోసం యువతను ఎన్నికల్లో గొడవ పడేలా ప్రోత్సహించారన్నారు. రాజకీయ పార్టీలు యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకోని ఎటువంటి హింస జరగకుండా చూడాలని విన్నవించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానం అయినా మెగా డీఎస్సీ మీద సంతకం చేయటం సంతోషమని, అలాగే మెగా డీఎస్సీ విడుదల చేయాలని ఆందోళనలు చేసిన సందర్భంగా పోలీసులు పెట్టిన కేసులు ఎత్తివేయాలన్నారు. గ్రామ వలంటీర్ వ్యవస్థను రాజకీయ పార్టీలు తమ పార్టీ కార్యకర్తల కేంద్రం గా కాకుండా నడపాలన్నారు. మెరిట్ ఆధారంగా నియమించాలని, ఇంటర్వ్యూ ద్వారా నియమించే పద్ధతిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు జడ రాజ్ కుమార్, ఉదయ్ భాస్కర్, ఇక్లాస్, హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

భార్యను వేధించిన భర్త సహా ముగ్గురిపై కేసు నమోదు

సత్తెనపల్లి: భార్యని వేధించిన భర్త సహా మరో ముగ్గురిపై పట్టణ పోలీస్‌స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. వివరాలు ఇలా ఉన్నాయి... పట్టణంలోని వడవల్లి పోలేరమ్మ గుడి ఏరియాకి చెందిన రేవతికి, రొంపిచర్ల మండలం తుంగపాడు గ్రామానికి చెందిన ములుపూరి నాగేశ్వరరావుకు ఏడు సంవత్సరాల క్రితం వివాహమైంది. రెండేళ్ల పాటు కలిసిమెలిసి ఉన్నారు. అనంతరం మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్న నాగేశ్వరరావు భార్యను అధిక కట్నం తీసుకురమ్మని వేధించాడు. ఆయనతోపాటు అత్త, మామ, ఆడబిడ్డ వేధించడంతో ఐదేళ్ల క్రితం ఆమె సత్తెనపల్లి వచ్చి కోర్టును ఆశ్రయించడంతో కోర్టు ఆదేశాల మేరకు పట్టణ పోలీస్ స్టేషన్‌లో సీఐ పీ.శ్రీనివాసరావు కేసు నమోదు చేశారు.

ఆలయంలో మహా అన్నదాన కార్యక్రమం



విశేష అలంకరణలో నర్శింగపాడు గ్రామంలోని శ్రీ మరకతలింగ చంద్రమౌళీశ్వరస్వామి వారు

నకరికల్లు మండలంలోని నర్శింగపాడు గ్రామంలోని శ్రీ మరకతలింగ చంద్రమౌళీశ్వరస్వామి ఆలయం 7 వ వార్షిక వేడుకలు శనివారం ఘనంగా ముగిశాయి. ఆలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. వేడుకలకు తరలివచ్చిన భక్తజనంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. అర్చకులు పమిడిమర్రు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విశేషపూజలు చేశారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ చండీహోమం నిర్వహించారు. స్వామివారికి విశేష ద్రవ్యములతో అభిషేకాలు చేశారు. స్వామివారిని, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. సమీపంలోని పలుగ్రామాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. విశేష అలంకరణలో ఉన్న స్వామివార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించారు. భక్తసంఘం సహకారంతో ఆలయం వద్ద మహా అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

21న సత్తెనపల్లి నుంచి అరుణాచలానికి బస్సు

సత్తెనపల్లి: పట్టణంలోని ఆర్టీసీ డిపో నుండి ఈ 21న మధ్యాహ్నం 3.00 గంటలకు అరుణాచలానికి సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరుతుందని సత్తెనపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ జీఎస్‌వీవీ కుమార్ శనివారం తెలిపారు. ఈ నెల 22న అరుణాచలం, గిరి ప్రదక్షిణ, దర్శనం అయిన తర్వాత అదే రోజు సాయంత్రం బయలుదేరి కంచి మీదుగా సత్తెనపల్లి ఈ నెల 23న ఉదయం చేరుకుంటారన్నారు. టిక్కెట్ ధర రాను పోను ఒక్కొక్కరికి రూ.2 వేలు మాత్రమేనన్నారు. భక్తులు, యాత్రికులు ఈ అవకాశమును వినియోగించుకోవాలని ఆయన కోరారు.

నేడు గాయత్రీ మాత ఆవిర్భావ దినోత్సవ పూజలు

సత్తెనపల్లి: పట్టణంలోని శ్రీశ్రీశ్రీ ఫిరోజి ఋషీంద్రుల వారి మఠంలో వేంచేసిన గాయత్రీ మాత ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఆదివారం జ్యేష్ఠ శుద్ధ దశమిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు శ్రీశ్రీశ్రీ ఫిరోజి ఋషింద్రుల ఉప పీఠాధిపతి ఫిరోజ్‌బాబు శనివారం తెలిపారు. భక్తులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని ఆయన కోరారు.